ప్రజాశక్తి
బుధవారం 21 జూన్ 2023



టెన్త్ విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరి విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల ఎంపీపీ బి.ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ సూచించారు. మండలంలోని అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను ముఖ్యమంత్రి జగన్ ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని ఇస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

తిలకం దిద్ది, హారతులిస్తూ..

సిపిఎం మహాపాదయాత్రకు ఘన స్వాగతాలు



భారీ జనసమూహంతో జరుగుతున్న పాదయాత్ర, అగ్రభాగాన విజ్జూకృష్ణన్, వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి-ఎటపాక, చింతూరు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో మంగళవారం ప్రారంభమైన పోరుకేక మహాపాదయాత్రకు నిర్వాసిత గ్రామాల్లో ప్రజలు తిలకం దిద్ది, హారలిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ పాదయాత్రను ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో మంగళవారం అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. నిర్వాసితులు పూలమాలను వేసి పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. కళాకారులకు, కార్యకర్తలకు, నిర్వాసితులకు అల్పాహారం, తాగునీరు కల్పించారు. పాదయాత్రకు అగ్రభాగాన కళాకారులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ డోలు కొమ్ము రేల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెల్లిపాకలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఎం శ్రేణులు, నిర్వాసితులు ట్రాక్టర్లలోనూ, మ్యాజిక్ ఆటోల్లోనూ, మోటార్ బైకులపైనా వందలాదిగా తరలివచ్చారు. ఎర్రని ఎండను సైతం లెక్కచేయకుండా ఎర్రజెండాలతో పాదయాత్రలో పాల్గొన్నారు. దీంతో నెల్లిపాక ప్రధాన కూడలి ఎరుపెక్కింది. బహిరంగ సభ అనంతరం ప్రారంభమైన పాదయాత్ర తోటపల్లి చేరుకుంది. అక్కడ మధ్యాహ్నం భోజనం అనంతరం ప్రారంభమైన పాదయాత్ర గన్నవరం, గౌరీదేవిపేట, నందిగామ మీదుగా మురుమూరు వరకు సాగింది. గన్నవరం గ్రామంలో సిపిఐ నాయకులు పాదయాత్ర బృందానికి పూలమాలవేసి స్వాగతం పలికారు. అనంతరం పోలవరం ఉద్యమకారుడు, రైతు సంఘం నాయకుడు కందుల శ్రీనివాస్ స్తూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ పాదయాత్రలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, ఎపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు బలరాం, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు కుంజా రాధ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, మోడం నాగయ్య. విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి. కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్న, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, కూనవరం నాయకులు మేకల నాగేశ్వరరావు, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పంచాయతీ తీర్మానం అందజేత

సిపిఎం మహా పాదయాత్ర బృంద నాయకుడైన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు ఎటపాక మండలం నందిగామ పంచాయతీ గ్రామ సభ తీర్మానాన్ని అందజేశారు. 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని నందిగామ పంచాయతీలోని నందిగామ, నందిగామపాడు గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చి పునరావాసం కల్పించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ మేరకు గతంలో రూ.1.15లక్షలు పరిహారం ఇచ్చిన భూములకు రూ.5లక్షలు చెల్లించాలని, రాబోయే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలుగా నిత్యవసర సరుకులు, టార్పాలిన్లు, కిరోసిన్/సోలార్ లాంతర్ తదితరాలు సిద్ధం చేసి ఉంచాలని పంచాయతీ చేసిన గ్రామసభ తీర్మానాన్ని గ్రామ ప్రజలు శ్రీనివాసరావుకి అందించారు.



నందిగామలో గ్రామసభ తీర్మానన్ని అందిస్తున్న గ్రామస్తులు



పాదయాత్ర అగ్ర భాగాన డోలు కొమ్ము నృత్యం



పాదయాత్ర బృందానికి తిలకం దిద్ది హారతి ఇస్తున్న మహిళలు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయండి : విఎస్ఆర్

ఎటపాక : పాదయాత్ర సందర్భంగా నందిగామలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది జూలైలో వరదల కారణంగా నందిగామ గ్రామం పూర్తిగా మునిగినా నష్ట పరిహారం చెల్లించలేదని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యంపై 3గంటల పాటు రాస్తారోకో చేసారని, అందులో తను కూడా పాల్గొన్నానని గుర్తు చేశారు. కానీ నేటికీ ఈ గ్రామానికి వరద నష్ట పరిహారం చెల్లించలేదని, 41.15 కాంటూరులో చేర్చలేదని పేర్కొన్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అనే జగన్ గతంలో రైతులకు రూ.1.15లక్షలు ఇచ్చిన రైతులకు రూ.5లక్షల ఇస్తామని వాగ్దానం చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. 4సంవత్సరాలు గడిచినా ఇచ్చిన మాట నెరవేర్చక పోవడం మడమ తిప్పడం కాదా అని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులు పరిహారం పునరావాసం అడుగుతుంటే వినిపించడం లేదా అన్నారు. తాడేపల్లి పాలస్‌లో పడుకున్నావా అంటూ మండిపడ్డారు. పోలవరం నిర్వాసితులందరికీ ఒకే సారి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రకు వందలాదిగా కదిలిన జనం

ప్రజాశక్తి- విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ఎటపాక మండలం నెల్లిపాకలో మంగళవారం ప్రారంభమైన మహాపాదయాత్రకు విఆర్.పురం మండలం నుండి నిర్వాసితులు, సిపిఎం శ్రేణులు భారీగా తరలివెళ్లారు. రేఖపల్లిలో ఎంపిపి కారం లక్ష్మి, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ, మాజీ ఎమ్మెల్యేఎ సతీమణి సున్నం చుక్కమ్మ ఎర్ర జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుండి వాహనాల్లో వందలాది మంది నెల్లిపాక బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పంప సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, పూనం ప్రదీప్ కుమార్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు కారం సుందరయ్య, సోడి మల్లయ్య, పోడియం శ్రీరామ్మూర్తి, ప్రకాష్, సత్యనారాయణ, సుధీర్, హజరత్, కన్నయ్య, వీర్ల నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.



విఆర్.పురం నుండి బహిరంగ సభకు బయలుదేరిన నిర్వాసితులు, సిపిఎం శ్రేణులు



మాట్లాడుతున్న ఎఎస్‌పి ధీరజ్

1,760 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల:గంజాయి కేసులో నిందితుడిని విచారించి 1760 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడుని అరెస్ట్ చేశామని పాడేరు ఎఎస్‌పి ధీరజ్ తెలిపారు. మంగళవారం జి.మాడుగుల స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 13న తమిళనాడుకు చెందిన బి.సురేష్ చెన్నైలో ఎన్సీబీ అధికారులకు 160 కేజీల గంజాయితో పట్టు బడ్డాడన్నారు. నిందితుడిని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాడేరు ఏజెన్సీ ఏరియాలో సుందర్రావు వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు తెలిపాడని, ఈ మేరకు ఒక టీం చెన్నై నుండి ఎన్సీబీ అధికారులు వచ్చి విచారించారన్నారు. ఈ కేసులో భాగంగా ఈనెల 20న ఎన్సీబీ అధికారులు జి.మాడుగుల సిఐ, ఎస్ఐ, పెదబయలు ఎస్సైలు పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామానికి చేరుకొని గొల్లూరి సుందర్రావు ఇంటిని పరిశీలించారన్నారు. ఇంటి అటకపై గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. 71 బస్తాలలో 1760 కేజీల గంజాయిని గుర్తించారు.ఎన్సీబీ అధికారులు గొల్లూరు సుందర్రావుని అదుపులోకి తీసుకొని జి.మాడుగుల పోలీస్ స్టేషన్‌కి తీసుకు వచ్చినట్టు ఆయన తెలిపారు. పట్టుబడిన గంజాయితో పాటు నిందితున్ని ఎన్సీబీ అధికారులతో చెన్నై తరలిస్తున్నట్టు తెలిపారు.



మాట్లాడుతున్న దొన్నుదొర

లోకేష్ పాదయాత్రకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీవేరి దొన్నుదొర ఆధ్వర్యాన యండపల్లివలస రైల్వే స్టేషన్ నుండి ఎన్టీఆర్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సీవేరి దొన్ను దొర మాట్లాడుతూ, 2024లో అరకు నియోజకవర్గంలో టీడీపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మిని మేనిఫెస్టో చూసి జగన్ మోహన్ రెడ్డి కి భయం పట్టుకుందన్నారు.రాష్ట్ర ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.

అరకు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, జీవో 3పై రాష్ట్ర ప్రభుత్వం కనీసం రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు చిట్టిబాబు, అరకు వేలి మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, బూర్జ లక్ష్మి, అరకు పార్లమెంట్ కోశాధికారి వంతాల నాగేశ్వరరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు జరగని న్యాయం

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ ముంపు వల్ల నష్టపోతున్న ప్రజలకు సరైన న్యాయం జరగడం లేదు. ప్రతిఏటా ముంపు ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వచ్చే వరదలకు కూనవరం, ఎటపాక, విఆర్.పురం, చింతూరు 4 మండలాల్లో అనేక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కట్టు బట్టలతో రోడ్డున పడుతున్నారు. అన్ని గృహోపకరణ వస్తువులను గోదారమ్మకు వదిలేసి బతుకు జీవుడా అని ఎత్తయిన ప్రాంతాలలో తల దాచుకుంటున్న పరిస్థితి. అటు వరద వచ్చి ఇబ్బంది పడ్డ ప్రజలు వరద తగ్గాక కూడా ఇళ్లలో బురద పేరుకు పోయి ఒక్క ఇంటిని శుభ్రం చేయడానికి రూ.20వేలు నుండి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు పంటలు ఆలస్యంగా వేయాల్సి వస్తోంది. ముంపు మండలాలలో అత్యధికంగా వేసే మిర్చి, పొగాకు లాంటి వాణిజ్య పంటలు వరదల వల్ల 3 నెలలు ఆలస్యంగా వేయాల్సి వస్తోంది. దీంతో దిగుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. గతేడాది వరదలు సమయంలో ముఖ్యమంత్రి ఇస్తానన్న రూ.10వేలు ఆర్థిక సాయం కూడా నేటికీ అందని పరిస్థితి ఉంది. మరో వైపు కాంటూరు 41 అడుగుల లెక్కలు చెబుతూ పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా ప్రభుత్వాలు కాలం వెల్లదీస్తున్నాయి. గతేడాది వచ్చిన వరదలకు మొత్తం మునిగిపోవడంతో కాంటూరు లెక్కలు పెద్ద బూటకమని ప్రకృతి సైతం తేల్చింది. అటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదు. నష్టపరిహారం ఇవ్వడం లేదు. పునరావాసం కల్పించడం లేదు. ముంపు మండలాలు రోజులు తరబడి నీటిలో మునిగితే చూసే నాథుడే కరువైయ్యారు. కనీసం నిత్యావసరాలు కూడా సరిగా ఇవ్వలేదన్నది సగటు ముంపు బాధితుల ఆవేదన. ఈ విధంగా ప్రత్యేక్షంగా పరోక్షంగా ముంపు ప్రజలకు అన్యాయం జరుగుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని గాలికొదిలేశాయి.

ఐటిడిఎ పిఒను కలిసిన ఎకనామికల్ సర్వీసెస్ సభ్యులు

ప్రజాశక్తి - రంపచోడవరం

ఇండియన్ ఎకనామికల్ సర్వీసెస్ సభ్యులు కెఎం.బాలరాజు మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రూర్బన్ మిషన్ ద్వారా ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. రంపచోడవరం మండలంలో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు, ఐ.పోలవరం గ్రామ సమీపంలోని కాలువ దగ్గర టూరిస్ట్ పాయింట్, ఆదివాసీ వర్తక సమూదయం వెనకభాగం కమ్యూనిటీ హాల్ ఏ విధంగా అభివృద్ధి చేసింది అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఎన్.శ్రీనాథ్. కన్సల్టెంట్ రూర్బన్ సిపిఆర్ఆర్డి వినోద్ కుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, రంపచోడవరం ఎంపీడీవో జాన్ విల్టన్ తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేతో సమావేశమైన బాలరాజు

అడవులను కాపాడాల్సిన బాధ్యత అటవీశాఖదే

రాష్ట్ర పిసిసిఎఫ్ మధుసూధన్ రెడ్డి



పర్యటిస్తున్న మధుసూధన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతగిరి:ఏజెన్సీ ప్రంతంలో ఉన్న అడవుల్ని కాపాడి, ప్రకృతి అందాలను మరింత అబివృద్ధి చేయవలసిన బాధ్యత అటవీ శాఖ సిబ్బందిపై ఉందని రాష్ట్ర పిసిసిఎఫ్ వై.మధుసూదనరెడ్డి సూచించారు. మంగళవారం అనంతగిరి మండల చిలకలగెడ్డ ఫారెస్ట్ ఠాణా వద్ద ఏకో టూరిజం ప్రాజెక్ట్ ప్రారంభించారు. అరకులోయకు వచ్చే పర్యాటకులకు ఏజెన్సీ ముఖద్వారం అయినందున సేద తీర్చుకునేందుకు రెస్టారెంట్, చెక్ పోస్టు ఆనుకుని ఉన్న ఎత్తైన కొండలో 3 కిలోమీటర్ల ట్రక్కింగ్ స్థలం ఏర్పాటు చేశామన్నారు ప్రకృతిని ఆశ్వాదించేందుకు చెట్లు పెంచుతున్నామరు. అడవులు బావితరం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని తెలిపారు. గిరిజన ప్రాంతంలోని భవిష్యత్‌లో ఏకో టూరిజం పేరిట అనేక ప్రాజెక్టులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిసిఎఫ్ శ్రీకాంత్ రెడ్డి, పాడేరు డి ఎఫ్ఓ వినోద్‌కుమార్, అనంతగిరి రేంజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి

-భర్తకు ఉద్యోగం, భూమి ఇవ్వాలి

-ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: స్ట్రక్చర్‌పై మోసుకొస్తుంటే మార్గమధ్యలో నిండు గర్భిణి పాంగి రోజా(20) మృతి చెందిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డి.మాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, కొయ్యూరు మండలం మూలపేట పంచాయితీ కొండ శిఖర గ్రామమైన కుంబుర్ల గ్రామం 45 కుటుంబాలు 230 మంది జనాభా గల ఆదివాసి కొందు తెగ గిరిజనులు జీవనం సాగిస్తున్నారని, వీతరికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం, అధికార్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ళు గా రహదారి నిర్మాణం జరగలేదన్నారు. రోడ్డు లేక గ్రామస్తులు ఎన్నో దురావస్థలను ఎదుర్కొంటున్నారని ఇందుకు నిదర్శనం నిండు గర్భిణి మృతి నిదర్శనమని అన్నారు. మంగళవారం సాయంత్రం కొర్ర రోజా(22) పురిటి నొప్పులు రావడంతో గ్రామస్తుల సహాయంతో ఆశా కార్యకర్త, మరి కొంతమంది స్ట్రక్చర్‌పై మోసుకొస్తూ కిలోమీటర్ దూరం దాటిన తర్వాత మార్గం మధ్యలో మృతి చెందిందని తెలిపారు. కుంబుల్ల ఆర్ల గ్రామం వరకు ఎత్తైన కొండ శిఖర గ్రామం ఎనిమిది కిలోమీటర్లు రాయలు రప్పలు దాటుకుంటూ ఆర్ల గ్రామానికి చేరుకోవాల్సి ఉందని చెప్పారు. అక్కడినుండి డౌనూరు పిహెచ్‌కి తీసుకెళ్లవలసిన సమయంలో రెండు కిలోమీటర్ల దాటిన తర్వాత మార్గం మధ్యలో మృతి చెందడం బాధాకరమన్నారు. 2020 -21 సంవత్సరంలో ప్రతి ఇంటికి ఆరు లక్షల రూపాయలు చందాలు వేసుకుని సొంతంగా 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. భారీ వర్షాలు రావడంతో రోడ్ పలుసార్లు కొట్టుకు పోవడంతో మనిషి నడిచే మార్గమే ఉందని, ప్రభుత్వానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికార్లు ఆ గ్రామాన్ని సందర్శించి ఆదివాసి బతుకులను పరిశీలన చేయాలని చెప్పారు.మృతి చెందిన రోజా కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారాన్ని అందించాలన్నారు. ఆమె భర్తకు ఉద్యోగం, భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

26 నుంచి లెప్రసీ సర్వే

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేపట్టడానికి స్థానిక కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని కె.కరుణ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 26 నుంచి జూలై 16 వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపడుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని తెల్లని మచ్చలు, నరాలు ఉబ్బడంతో పాటు కాళ్ళు, చేతులు వంకర్లై స్పర్శ నొప్పు లేని పుండ్లు ఏర్పడి ఉంటే అవి లెప్రసీ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని సూచించారు. ప్రతి ఆశ కార్యకర్త, గ్రామ వాలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, హెచ్‌వీలు, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి



ప్రారంభిస్తున్న కన్జర్వేటర్ మధుసూధనరెడ్డి

ఎకో టూరిజం హబ్‌గా అంజోడ సిల్క్ ఫాం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అంజోడ సిల్క్ ఫాంను ఎకో టూరిజం హబ్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని అటవీ శాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి చెప్పారు. మండలంలోని పర్యటక కేంద్రమైన అంజోడ సిల్క్ ఫాంను ఆయన మంగళవారం సందర్శించారు. మొక్కలను నాటి ఎకో టూరిజం ఫైన్ ప్రాజెక్టు ప్రారంభించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా కాటేజీలు, కాఫీ విడిది హౌస్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టెంట్లు, మరుగుదొడ్లు, కాటేజీల నిర్మాణ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మన్యం వాతావరణం పర్యటకుల మదిని దోచుకుంటున్నాయన్నారు. అంజోడ సిల్క్ ఫాం ఆహ్లాదకరంగా ఉందన్నారు. 30ఎకరాల్లో రూ 75లక్షలతో ఎకో టూరిజంగా అభివృద్ధి చేసి పర్యటకులకు ఆహ్లాదం కలిగేలా సౌకర్యాలను కల్పిస్తామన్నారు. స్థానికంగా వన సంక్షరణ సమితి ద్వారా ఇక్కడ ఉపాధిని కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. విశాఖ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకాంతనాథరెడ్డి, డీఎఫ్ వినోద్ కుమార్, అటవీశాఖ రేంజర్ శ్రీనివాసరావు, బీట్ అధికారులు ఉద్దంగి, చంటి, విఎస్ఎస్ చైర్మన్ భారతి పాల్గొన్నారు.



రీ సర్వేను పరిశీలిస్తున్న గంగరాజు

రీ సర్వేతో సాగు రైతులను గుర్తించాలి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: సాగు రైతులకు అపోహలు లేకుండా భూ రీ సర్వేను వేగవంతం చేయాలని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు అన్నారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో రెండు బృందాలు ఏర్పడి నిర్వహిస్తున్న రీ సర్వే పనితీరును ఆయన సందర్శించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిరాయితి భూములు పూర్వకాలం నుండి సాగులో ఉన్న బంజర్, ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు సర్వేర్లు భాస్కర్ బాలకష్ణ సిబ్బంది రైతులు చిన్న గంగులు భీమన్న లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - రంపచోడవరం

క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ భాగస్వామ్యులు కావాలని పెదగెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్ అన్నారు. పెదగెద్దాడ గ్రామ సచివాలయంలో మంగళవారం ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవళికి పెనుముప్పుగా మారక ముందే క్షయను నిర్మూలించాలన్నారు. ఇందు కోసం గ్రామస్థాయిలో క్షయ లక్షణాలు ఉన్న వారిని క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు అవగాహన కల్పించాలన్నారు. క్షయవ్యాధి ప్రాణంతకం కాదని, క్రమ తప్పకుండా మందులు వాడి, మంచి ఆహారం తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. ప్రకృతి సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా క్షయ వ్యాధి పంచాయతీ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీబీ ఎస్‌టిఎస్ గీతాంజలి మాట్లాడుతూ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో క్షయ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఆధునిక టెక్నాలజీ ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరగాటి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సింగోజి కృష్ణకుమారి, ఎటీఎల్ఎస్ వంశీధర్, ఏఎన్ఎం ఎన్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కొయ్యూరు

లోకుల గాంధి ట్రస్ట్, అమ్మ హాస్పటల్ అధ్వర్యంలో ఉజ్వల మల్టీ రీఛార్జ్ వారి సహకారంతో మదర్ బ్లడ్ బ్యాంక్ వారితో కలిసి మంగళవారం మండలంలోని కొండగోకిరిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మదర్ బ్లడ్ బ్యాంక్ అధినేత గుప్తా, అమ్మ హాస్పటల్ అధినేత డాక్టర్ జివి.రాజు, ఎంవివి ప్రసాద్ ప్రారంభించారు. మొత్తం 60 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమనికి ఇంత స్పందన రావడం పట్ల రక్తదానం చేసిన వారికి కొండగోకిరిని దత్తత తీసుకున్న మఠం మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకుల గాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లోకుల రమేష్, ట్రస్టు గౌరవ అధ్యక్షులు లోకుల కిరణ్, ఉజ్వల మల్టీ రీఛార్జ్ అధినేత గౌరీ నాయుడు, కినపర్తి సర్పంచ్ రీమల శ్రీను, రీమల చంద్రరావు, మంగతల్లి పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం అంబేద్కర్ సెంటర్‌లో గల మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు మంగళవారం గ్రామ సర్పంచ్ మంగా బొజ్జయ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లలో ఆనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్ఎం డి.టాల్ స్టాయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నబాబు, ఎంపీటీసీ ఉలవ లక్ష్మి, పాఠశాల పిఎంసి చైర్మన్ మాధవ వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒను కలిసిన జెడ్‌పి డిప్యూటీ సిఇఒ

ప్రజాశక్తి - రంపచోడవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్‌పి నూతన డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరేనున మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ద్వారా ఏజెన్సీ అభివృద్ధిపై ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎంపీడీవో జాన్ విల్‌టన్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం



సీలేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి -సీలేరు

జీకె వీధి మండలం సీలేరులో మంగళవారం రాత్రి 7.40 గంట సమయంలో భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరితో ప్రజలు అల్లాడిపోతున్న నేపథ్యంలో మంగళవారం కురిసిన వర్షంతో ప్రజలు కొంత సేదతీరారు. మంగళవారం ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 తర్వాత మబ్బులు కమ్ముకొని చిన్న చిన్న చినుకులతో వర్షం మొదలై ఒక్కసారిగా ఉరుములతో కూడిన కుంభవృష్టి వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా సీలేరులో ప్రధాన రహదారులు, కాలువలు జలమయమయ్యాయి. ఈవర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రంపచోడవరం : రంపచోడవరంలో మంగళవారం సాయంత్రం ఉరుములతో కుండపోత వర్షం కురిసింది. పది రోజులుగా రంపచోడవరంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా ఎవరు బయటకు రాలేకపోయారు. మంగళవారం సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ఈదురు గాలులతో, మబ్బులు కమ్ముకొని భారీ వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

అప్పన్నను దర్శించిన శారదా పీఠాధిపతి

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను మంగళవారం శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌ఛార్జ్ ఇఒ డి.భ్రమరాంబ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ ఏటా మాస దీక్ష చేసే ముందు స్వామిని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని, రుషికేశ్ వెళ్లి ముందు స్వామిని దర్శించుకునేందుకు వచ్చానన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన స్వరూపానందకు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు దినేష్ రాజ్, సంపంగి శ్రీనివాసరావు, స్థానాచార్య శ్రీదేవి ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

సింహాద్రి అప్పన్నకు రికార్డు స్థాయి ఆదాయం

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న, పైడితల్లమ్మ ఆలయాల్లో భక్తులు హుండీల్లో కానుకలుగా వేసిన ఆదాయాన్ని మంగళవారం దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఇఒ డి.భ్రమరాంబ పర్యవేక్షణలో లెక్కించారు. అప్పన్న ఆలయంలో రికార్డు స్థాయిలో రూ.2.23 కోట్ల నగదు, 206 గ్రాముల బంగారం, 16 కేజీల 732 గ్రాముల వెండితోపాటు వివిధ దేశాలకరెన్సీ నోట్లు వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. అప్పన్న అనుబంధ దేవాలయమైన పైడితల్లమ్మ ఆలయ హుండీలో కానుకలు లెక్కించగా, రూ.8, 08,740 నగదు లభించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాసరాజు, ఆలయ ఎఇఒ నరసింహరాజు, సూపరెంటెండెంట్లు, ఇతర ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

కిడ్నాప్ బండారం బయట పెట్టండి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ ఇంట జరిగిన కిడ్నాప్ వ్యవహారంపై సిబిఐ, ఇడిల నేతృత్వంలో సమగ్ర విచారణ జరపాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పౌరగ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, అసలు ఇది కిడ్నాప్ కాదని, ఆర్థిక లావాదేవీల సెటిల్మెంట్ అని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అసలు బండారం బయటపెట్టాలన్నారు. ఒకవైపు తాను విశాఖలో వ్యాపారం చేయలేనని, హైదరాబాదుకు మకాం మార్చేస్తానని ఎంపి విశాఖపై అక్కసు వెళ్లగక్కితే, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి విశాఖపట్నం ప్రశాంతంగా ఉందని, ఎంపి ఇంట జరిగింది చిన్న సంఘటన అని చెప్పడం వెనుక అంతర్యం అంతుపట్టడం లేదన్నారు. మరోవైపు గతంలోనూ విశాఖను విడిచిపోతానని ప్రకటన చేసిన ఎంపి ఎంవివి, తర్వాత అనేక వివాదాస్పద ప్రాజెక్టులు చేపట్టారని, ఇప్పుడు అలాంటిదే మరో నాటకానికి తెరలేపుతున్నారేమో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పలు పోలీసు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన ఎంపి ఎంవివిగాని, మనీ ల్యాండరింగ్ ఆరోపణలున్న అక్రమాల ఆడిటర్ జివి విశాఖ వదిలి వెళితే ఇక్కడి వారంతా సంతోషిస్తారన్నారు. విశాఖలో గంజాయి బాబులు విజృంభిస్తున్నారని, గంటల్లో రావాల్సిన అనుమతులు 45రోజులైనా ఇవ్వని అధికారులు పనితీరుపైనా ఆరోపణలు చేసిన ఎంపి, జగన్ పాలనలో ప్రశాంత విశాఖలో శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పకనే చెప్పారన్నారు. ఎంపి ఇంట కిడ్నాప్ వ్యవహారంతోపాటు విశాఖలో జరుగుతున్న అనేక అక్రమాలపై పోలీసులు దృష్టిసారించాలని మూర్తి యాదవ్ కోరారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలపై...

గూడ గ్రామస్తుల ఆందోళన



పాడేరు సబ్ స్టేషన్ వద్ద బైఠాయించిన గూడ గ్రామస్తులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈ వేసవిలో కొన్ని రోజులుగా వేళాపాళా లేకుండా తరచూ విద్యుత్ సరఫరా నిలిచి పోతుండటంతో ఇంట్లో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నామని హుకుంపేట మండలం గూడ గ్రామస్తులు ఆందోళన చేశారు. సోమవారం రాత్రి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. సోమవారం మరమ్మత్తుల కోసం విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారని, .ఎంత సేపటికీ రాకపోవడంతో విద్యుత్ శాఖ సిబ్బందికి, సబ్ స్టేషన్ కు ఫోన్ చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ఉక్క పోతతో అల్లాడిపోయామని, బోర్లు పనిచేయక నీటి సమస్య ఎదుర్కొన్నామన్నారు. ఫోన్లు చేసినా ఫలితం లేకపోవడంతో ఆగ్రహిస్తూ గ్రామం నుంచి కొంతమంది యువకులు పాడేరు సబ్ స్టేషన్ కు చేరుకున్నారు. రాత్రి 10:30 గంటల నుంచి తెల్లవారుజాము ఒంటి గంటన్నర వరకు బైఠాయించి నిరసన చేపట్టారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సుమారు మూడు గంటల పాటు బైఠాయించిన గ్రామస్తులు అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో నిరసన విరమించారు. ఈ నిరసన కార్యక్రమానికి అండగా ఉండి సహకరించిన గ్రామానికి చెందిన కాంట్రాక్టర్, వైసిపి నాయకుడు ఓ.సామ్యూల్ ను గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి: నూతన జాతీయ విద్యా విధానం పేద విద్యార్థుల పాలిట ముప్పుగా మారింది. ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు దిగజారేలా విధానాలున్నాయి. కొన్ని కొలమాణాలతో పాఠశాలలు, తరగతులను ఇతర పాఠశాలల్లో విలీనంచేసి, గ్రామాలకు అందుబాటులో ఉండే ప్రాథమిక విద్యను దూరం చేసింది. తాజాగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 199 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (యుపి)ల్లో 98 మంది కంటే విద్యార్థుల సంఖ్య తక్కువుందని మొత్తం 410 సబ్జెక్టు టీచర్ పోస్టులను రద్దుచేసి, సర్దుబాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వెనుకాముందు చూడకుండా అత్యంత వేగంగా అమలుచేస్తున్న నూతన విద్యా విధానాల వల్ల ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పడిపోవడానికి దారితీయనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా సబ్జెక్టు టీచర్లులేక పది ఫలితాలు పడిపోయాయి. సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రాథమికోన్నత పాఠశాల నుంచి సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాల్సిన ప్రభుత్వం తగ్గిస్తోంది.

విద్యార్థుల సంఖ్య 98 మంది కంటే లోపున్నారని 410 వివిధ సబ్జెక్టు టీచర్ల పోస్టులు రద్దు చేసింది. కొద్ది రోజుల్లో కొత్తగా విద్యార్థులు చేరాక 98 మంది కంటే పెరిగినా, ఈ ఏడాది సబ్జెక్టు టీచర్లు పునరుద్ధరించే అవకాశంలేదు. తరగతుల విలీనంచేసి ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించి, విద్యపై పెడుతున్న ఖర్చులు మిగుల్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నంలో ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేస్తోంది. గతంలో కొన్ని ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులు యుపి పాఠశాలల్లో విలీనమయ్యాయి. విలీనమైన యుపి పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ప్రశ్నార్థకంగా మారింది. యుపి పాఠశాలకు కేటాయించిన నలుగురు ఎస్‌జిటిలు సబ్జెక్టు బోధిస్తారని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. పాఠశాల తరగతులు విలీనంకాకముందు యుపి స్కూళ్లో లెక్కలు, ఫిజికల్ సైన్సుతో పాటు సంఖ్యను బట్టి ఇంగ్లీష్, బయోలాజికల్ సైన్సు బోధన ఉపాధ్యాయులుండేవారు. నాణ్యమైన విద్యకోసం తరగతులను విలీనంచేసినట్లు చెప్పిన ప్రభుత్వం, విలీన ప్రక్రియ జరిగాక విద్యార్థులు తక్కువున్నారన్న పేరుతో సబ్జెక్టు టీచర్లను లేకుండా చేసింది.

98 మంది మంది కంటే తక్కువున్న యుపి స్కూళ్లు

అల్లూరి జిల్లాలో	: 71
అనకాపల్లి జిల్లాలో	: 110
విశాఖపట్నం జిల్లాలో	: 18
మొత్తం	: 199

సబ్జెక్టుల వారీగా రద్దుచేసిన టీచర్ పోస్టులు

లెక్కలు	: 149
సోషల్	:142
తెలుగు	: 37
హిందీ	: 36
బయోలాజికల్ సైన్సు	: 24
ఇంగ్లీష్	: 20
ఫిజికల్ సైన్సు	: 2
మొత్తం	:410

సమిష్టితత్వానికి తార్కాణం..

ఆదివాసీల భూమి పండుగ



రహదారిపై నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీ గిరిజనులు ప్రతి ఏటా వారి మొదటి పండుగ అయిన భూమి పండుగను సమిష్టిగా చేసుకుంటారు. ఇతర జాతుల వలే కాకుండా ఎవరి ఇంట్లో వారు పండుగ చేసుకోకుండా చిన్న పెద్ద ఊరు ఊరంతా కలిసి భూమి పండుగను అందరూ కలిసి సంతోషంగా సంబరాలు చేసుకుంటారు. ప్రతి ఏటా తొలకరి ప్రారంభంలో ప్రకృతి పచ్చదనంతో నిండిన సమయంలో ఆదివాసీలు దీనిని జరుపుకుంటారు.

భూమి పండుగతో తరువాతే మిగిలిన పండుగలు

భూమి పండుగ చేయకుండా ఆదివాసీలు మిగతా ఏ పండుగలను, ఉత్సవాలను నిర్వహించారు. తమ కులదైవాలు కూడా భూమి పండుగ తర్వాతనే కొలుస్తారు. తమ సంస్కృతీ సాంప్రదాయాలకు కట్టుబడి ఊరి జనమంతా ఒక్కటై సమావేశమవుతారు. భూమి పండుగ ఎప్పుడు చేయాలో గ్రామ పెద్దలతో పూజారి పటేల్‌లతో చర్చించి నిర్ణయిస్తారు. ఈ పండుగ ప్రత్యేకత ఏమిటంటే గ్రామంలో ఉన్న పురుషులందరూ విల్లంబులు పట్టుకుని సమీప అడవుల్లో జంతువుల వేటకు వెళతారు. ఆ సమయంలో తమ గ్రామ యువకులకు మహిళలు ఎదురెళ్లి తిలకాలు దిద్ది క్షేమంగా వెళ్లి.. వేటతో లాభంగా రావాలని కోరుతూ ఆదివాసీ గీతాలను ఆలపిస్తారు. మగవారు అలా అడవికి వెళ్ళిన అనంతరం గ్రామంలో ఉన్న మహిళలందరూ కలిసి సమిష్టిగా రహదారులపై అడ్డంగా కర్రలు పట్టుకొని, సామూహిక నృత్యం చేస్తూ వాహనాలను ఆపుతూ రేలా పాటలు పాడుతూ భూమి పండుగ చందాలను సేకరిస్తారు. అలా సేకరించిగా వచ్చిన డబ్బులను గ్రామంలో ఉత్సవాలకు ఖర్చు చేస్తారు. అడవికి వేటకై వెళ్లి వేటాడి తెచ్చిన జంతువులను గ్రామంలో అందరూ కలిసి వాటాలు వేసుకొని సమానంగా పంచుకుంటారు.

కోడిగుడ్డును బాణంతో కొట్టడంతో...

భూమి పండుగ ప్రారంభానికి ముందు గ్రామంలో మహిళలు కోడుగుడ్డుకి కుంకమ, తిలకం దిద్ది ఒక ప్రదేశంలో పెట్టి వేటకు వెళ్లే విల్లంబులను ఎక్కుపెట్టి గురి చూసి గుడ్డును కొడతారు. అలా చేస్తే గురి తప్పకుండా మగవారు అడవికి వెళ్లి వేటను కచ్చితంగా జంతువులు వేటాడి తీసుకువస్తారని ఒక నమ్మకం. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పటేల్ పూజారి గ్రామస్తులు పాల్గొంటారు. ఆదివాసీల పండుగలు అడవిలో వేట ఒక ముఖ్య ఘట్టం. ఆదిమ కాలం నుండి తమ పూర్వీకులు ఆచరిస్తున్న భూమి పండుగను మరువకుండా వారి భావితరాలకు అందించే క్రమంలో ప్రతి సంవత్సరం జూన్ నెలలో మొదటి వారంలో పండుగను ప్రారంభిస్తారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రోజు భూమి పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.



విల్లంబులు ఎక్కుపెడుతున్న గిరిజన పురుషులు

ఏజెన్సీ అభివృద్ధికి ఎన్‌జిఒలు ముందుకు రావాలి



సోలార్ దీపాలు పంపిణీ చేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పిఎంఆర్‌సి సమావేశ మందిరంలో హాల్ట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా మారుమూల గ్రామాలకు సోలార్ వీధిలైట్లును పంపిణీ చేశారు. పుల్లంగి, చావడికోట, బోలకొండ, రంపచోడవరం, అనిగేరు, ఆకూరు, వేములకొండ, మర్రిపాలెం తదితర పంచాయితీల గ్రామాలకు 100 సోలార్ వీధి లైట్లు అందజేశారు. ఇందులో పాల్గొన్న పిఒ మాట్లాడుతూ ఒక్కొక్క లైట్ రూ.14వేలు విలువ చేస్తుందని, వీటిని అందిచడం అభినందనీయమన్నారు. ఇంకా మారుమూల గ్రామాలకు ఇటువంటి సోలార్ వీధిలైట్లు వివిధ రకాలైన ఎన్జీవోలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సోలార్ వీధిలైట్లు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించిన గ్రీన్ ఎనర్జీ ఆంధ్ర ప్రదేశ్ ఎన్జీవోకు, ఆదివాసీ మహాసభ సంస్థ కార్యదర్శి జి చిన్నారావు, సహాయకులు ఐ సూర్యనారాయణ, న్యాయవాది ఎవి సత్యనారాయణ, వన్ చైల్డ్ వన్ లైట్ సహాయకులు విజయవాడ ఆల్ట్ ఎన్జీవో వారికి చెన్నారెడ్డి, వీరభద్రరెడ్డి, పాండవులు తదితరులను పిఒ అభినందించారు.

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

నేరాలు ఘోరాలు

బైక్, జీపు ఢీకొని వ్యక్తి మృతి



ఢీకొన్న బైక్, జీపు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో కే.కోడాపల్లి గ్రామ మలుపు వద్ద ద్విచక్ర వాహనం, జీపు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే... పాడేరు నుండి జి.మాడుగుల వస్తున్న జీపు, పాడేరు నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనం కోడపల్లి గ్రామ సమీపంలో మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పాడేరు మండలం ఇరుడాపల్లి పంచాయతీ సరియా పల్లి గ్రామానికి ద్విచక్ర వాహనదారుడు చిన్నయ్య(30) మృతి చెందగా కూడా నారాయణ పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

వెయ్యి లీటర్ల నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు, మంప పోలీసు స్టేషన్ల పరిధిలో 58 కేసుల్లో పట్టుబడిన సుమారు 1000 లీటర్ల నాటు సారాను దగ్గరుండి ధ్వంసం చేయించారు. చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ధ్వంసం చేశారు. మంగళవారం ఆయన కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. కొయ్యూరు సీఐ స్వామి నాయుడు, ఎస్సై రాజారావు, మంప ఎస్ఐ లోకేష్ కుమార్, కొయ్యూరు, మంప పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి- మారేడుమిల్లి

భూదేవి పండుగను తిలకిద్దామని బైకుపై వెళ్తున్న బైక్‌ను బొలెరో వ్యాన్ ఢీకొని మంగళవారం ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మారేడుమిల్లి మండలం ఇవ్వంపల్లి గ్రామానికి కూతవేటు దూరంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వై.రామవరం మండలం చింతలపూడి గ్రామానికి చెందిన రేవుల రమేష్ రెడ్డి (23), కత్తుల వీరపు రెడ్డి (18) అనే ఇద్దరు యువకులు కలసి ద్విచక్ర వాహనంపై మండలంలోని ఇవ్వంపల్లి గ్రామంలో జరిగే భూదేవి పండుగకు వస్తున్నారు. గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన బొలెరో మ్యాక్స్ పికప్ వాహనం అటువైపుగా వెళ్తూ ఇవ్వంపల్లి గ్రామానికి కూతవేటు దూరంలో వారి బైక్‌ను వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు స్పృహ తప్పిపోయారు. దీనిని గమనించిన గ్రామస్తులు అక్కడి చేరుకుని అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, అంబులెన్స్ సిబ్బంది మారేడుమిల్లి పీహెచ్సీకి తరలించగా అప్పడికే ఇద్దరు మృతి చెందారు. వ్యాన్ డ్రైవరు వ్యాన్‌తో సహా పరారయ్యాడు. పోలీసులు గాలించి వ్యాన్ డ్రైవరును పోలీసులు పట్టుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఎయిడెడ్ పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి లూథరన్ ఎయిడెడ్ పాఠశాల అభివృద్ధికి ఆ గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ మంగళవారం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాలకు కరెంట్ విషయమై విద్యుత్ శాఖ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పాఠశాలకు ఇటీవల వచ్చిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముంగారి పొన్నాలు, వాలంటీరు చెక్కా మల్లిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, జడ్డంగి గిరిసీమ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న తహశీల్దార్

జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సుబ్రమణ్య ఆచారి, ఎంపీడీఓ యాదగిరేశ్వర రావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఎ.సత్యనారాయణ, ఈవోపిఆర్డీ శ్రీనివాస్, ఏపీఓ సురేష్, ఏపిఎం ఆదినారాయణ, పలు పంచాయతీల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న వైద్యశాఖ ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ఆ శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.స్వామి, బి.గంగాధర్, పి.దొన్ను కోరారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గత పదేళ్ల నుంచి 20 ఏళ్ల వరకు వైద్య శాఖలో కాంటాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగులు పని చేస్తున్నామన్నారు. కొండలు, వాగులు దాటుకుంటూ పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ తమను పర్మినెంట్ చేస్తారని ఎంతో ఆశతో ఉన్నామని, 2014లోపు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలన్న నిబంధనలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిబంధనలతో ఏజెన్సీ ప్రాంతంలో కాంట్రాక్టు ఉద్యోగులెవ్వరూ పర్మినెంట్ అయ్యే అవకాశం లేదని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట: భూ యజమానుల ఆమోదంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామంలో ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఏ.బాలకష్ణ, బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి తెచ్చిన సిసిఆర్సి చట్టంతో గత నాలుగేళ్లుగా కౌలు రైతులు గుర్తింపు కార్డులకు నోచుకోలేదని తెలిపారు. దీంతో ఇన్పుట్ సబ్సిడీలు, రుణ సౌకర్యం, పంట నష్టపరిహారాలు భూ యజమానులే పొందుతున్నారన్నారు. వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులు అపార నష్టానికి గురై అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలకు బలైపోతున్నారని పేర్కొన్నారు.భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణం అందించాలన్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మోకిన మాణిక్యం, గంగిరెడ్డి శ్రీను, పి.ధనలక్ష్మి, టి సూరిబాబు, బోడపాటి రాజు, చిన్ని నాగరాజు పాల్గొన్నారు.

ఎస్ఐకి పురస్కారం

ప్రజాశక్తి-రోలుగుంట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించడంతో మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా రోలుగుంట ఎస్సై నాగకార్తీక్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సైను పలువురు అభినందించారు.